# జామతోట

## రస్కిన్ బాండ్

జామచెట్లు ఎక్కటం తేలిక. జామపండ్లు తినటానికి బాగుంటాయి. ఆడ, మగ పిల్లలు జామ తోట అంటే ఇష్టపడటంలో ఆశ్చర్యమేమీ లేదు మరి.

రంజీ వాళ్ల ఇంటికి ఎదురుగా రోడ్డుకి ఆవలివైపు ఒక జామతోట ఉంది. దాని చుట్టూ ఒక చిన్నగోడ ఉంటుంది. వర్షాకాలం వానలు ఆగిపోతున్న కాలం. సెప్టెంబరులో వెచ్చగా, తేమగా ఉన్న ఒకరోజు ఆకుపచ్చరంగు నుంచి బంగారు వన్నెకు మారుతూ జామకాయలు పండుతున్న కాలమది. జామకాయలు గట్టిదనం పోయి మెత్తగా, తియ్యగా, సువాసనలు వెదజల్లుతూ ఉన్నాయి.

ఏదో పండుగ కారణంగా బడికి శలవలిచ్చారు. రంజీ వాళ్ల నాన్న ఆఫీసుకు వెళ్లిపోయారు. రంజీవాళ్ల అమ్మ ఇంటి వెనక పెరడులో మంచంమీద మధ్యాహ్నపు నిద్ర సుఖాన్ని అనుభవిస్తోంది. వాళ్ల అమ్మమ్మ తన పెంపుడు చిలుకకు ప్రార్థన నేర్పించటంలో నిమగ్నమయింది.

''ఆ జామ చెట్లు ఎక్కాలని రంజీ తనలో తాను అనుకున్నాడు. 'చెట్లు ఎక్కి కొన్ని నెలలు అయి ఉంటుంది.''

వెంటనే అతడు రోడ్డు దాటి గోడ దూకి జామచెట్ల మధ్యకి చేరుకున్నాడు. తనను ఎవరూ గమనించకుండా ఉండేలా తోట మధ్యలో ఒక చెట్టును ఎంపిక చేసుకుని వేగంగా దాని కొమ్మల్లోకి ఎక్కేశాడు. అతడికి సరిగ్గా పైన ఒక జామపండ్ల గుత్తి ఉంది. వాటిల్లో ఒకటి కొయ్యటానికి చెయ్యి ఎత్తాడు. ఆకుల మధ్య నుంచి ఉన్నట్టుండి కిందకి దూసుకొచ్చిన ఒక కాలు తన చేతికి చిక్కటంతో అతడు ఆశ్చర్యపోయాడు.

పాదం చేతికి చిక్కటంతో రంజీదానిని వదిలిపెట్టలేదు. దానిని గట్టిగా కిందకి లాగాడు. ఒక చిన్న అరుపుతో ఎవరో తన మీద పడ్డారు. రంజీ ఆ వ్యక్తి కాళ్లు, చేతులతో తలపడ్డాడు. ఇద్దరూ కలిసి రెండు మూడు కొమ్మల నుంచి జారి కింద మెత్తటి మట్టిపై దభీమంటూ పడ్డారు.

రంజీ, ఆ కొత్తవ్యక్తి ఒకరితో ఒకరు తలపడ్డారు. ఇద్దరు గడ్డిలో దొర్లారు. రంజీ తన ప్రత్యర్థిని జుడో బంధంలో పట్టాలని చూశాడు కానీ సఫలం కాలేదు. అప్పుడు అతని ప్రత్యర్థి ఒక ఆడపిల్ల అన్నది గమనించాడు. ఆమె కోకి-' అతడి పక్కింటి అమ్మాయి, తన స్నేహితురాలును.


''నువ్వా!'' అతడు రొప్పుతూ అన్నాడు.

''నేనే'' అంది కోకి,-''నువ్వు ఇక్కడ ఏం చేస్తున్నావు?''

''నీ మోకాలు నా డొక్కలోంచి తియ్యి ముందు'' కొంతసేపు ఊపిరి తీసుకున్న తరువాత ''చెట్టు ఎక్కాలన్న సరదా పుట్టింది'' అన్నాడు.

''నాకూ అంతే.''

అతడు ఆమె వంక తేరిపార చూశాడు. ఆమె మూతి చివర, బట్టల మీద జామరసం పడి



ఉంది.

''జామ పండ్లు బాగున్నాయా?'' అతడు అడిగాడు.

''ఈ చెట్టు కాయలు చాలా తియ్యగా ఉన్నాయి'' అంది కోకి. ''రంజీ, నువ్వు ఇంకో చెట్టు చూసుకో. ఎంచుకోటానికి ముప్పై, నలభై చెట్లున్నా ఉంటాయి.''

''అన్నీ ఊరికే పోతున్నాయి'' అన్నాడు రంజీ.

''చూడు కొన్ని జామకాయలను పిట్టలు ఎలా పాడు చేశాయో.''

''ఎవరికీ వీటి అవసరం ఉన్నట్లు కనబడటం లేదు.''

కోకి తన చెట్టు తిరిగి ఎక్కింది. ఆమె కోరిక మన్నించి రంజీ కొంత దూరంలో ఉన్న చెట్టును ఎంపిక చేసుకుని ఎక్కాడు. పలకరింపులు అయిన తరువాత ఇద్దరూ జామపండ్లు తినటంలో మునిగిపోయారు.

''నేను ఇప్పటికి అయిదు పండ్లు తిన్నాను'' కొంత సేపటికి కోకి అంది.

''నువ్వు ఇక తినటం ఆపటం మంచిది.''

''నువ్వు ఇప్పుడే మొదలుపెట్టావు కాబట్టి ఆ మాట అంటున్నావు.''

''నువ్వు తింటే నాకు తక్కువ పడవులే.''

''నాకు కడుపునొప్పి మొదలవు తున్నట్లు అనిపిస్తోంది.''

''నేను ముందే చెప్పాను. పద నిన్ను ఇంటికి తీసుకెళతాను. మళ్లీ రేపు వద్దాం. ఇంకా చాలా జామ పండ్లు ఉన్నాయి. వందలు!''

''నాకింకా తినాలనిపించటం లేదు'' అంది కోకి.

* * *

మరునాటికి ఆమె కడుపు నొప్పి తగ్గిపోయింది.

రంజీ కోసం ఎదురుచూస్తూ ఆమె గేటు దగ్గర నిలబడి ఉంది. ఆమెతో పాటు ఆమె చిన్న తమ్ముడు తేజు కూడా ఉన్నాడు. అతడికి ఆరేళ్లే. కాని చిచ్చరపిడుగు.

''ఇవ్వాళ నీకు ఎలా ఉంది?'' రంజీ అడిగాడు.

''ఆకలిగా ఉంది'' అంది కోకి.

''మీ తమ్ముడిని ఎందుకు తీసుకొచ్చావు?''

''వాడు చెట్లు ఎక్కటం నేర్చుకుంటానంటు న్నాడు.''

వాళ్లు జామతోటలోకి వెళ్లారు. ఒక చిన్న చెట్టు ఎక్కటానికి తేజుకి సహాయపడి రంజీ, కోకి వేరే చెట్లు చూసుకున్నారు. వాళ్ల అలికిడికి ఒక చిలకల గుంపు అరుచుకుంటూ ఎగిరిపోయింది.

మూడు వేర్వేరు చెట్లమీద ఉన్న ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి ఒకరితో ఒకరు మాట్లాడుకుంటూ ఉండటం చాలా గోలగానే ఉంటుంది. ఆ అలికిడికి లేచింది చిలకలొక్కటే కాదు. వాళ్లకి తెలియదు కానీ ఆ తోట ఒక ధనిక వ్యాపారిది. అతడు ఆ తోటకి ఒక కాపలా వ్యక్తిని పెట్టాడు. పిట్టలు, పిల్లలు, కోతులు పండ్లుతినే ఇతర జీవాలనుంచి తోటని కాపాడటం అతని పని. కాని ఎండగా ఉన్న మధ్యాహ్న సమయంలో కాపలా వ్యక్తి గోపాల్ ఒక కునుకు తియ్యకుండా ఉండలేకపోయాడు.

బాగా నీడనిచ్చే పనస చెట్టుకింద అతడు నిద్రపోతూ పెడుతున్న గురకలకి తుఫాను ముంచు కొస్తోందన్న భయంతో అతడికి కొంత దూరంలోనే ఈగలు ఝుమ్మంటూ తిరుగుతున్నాయి.

సంతోషంతో పెడుతున్న కేకలకి అతడికి మెలకువ వచ్చింది. అతడు లేచి కూర్చుని మీసాన పాకుతున్న అక్షింతల పురుగును దులుపుకున్నాడు. మామూలుగా కాపలా వ్యక్తుల చేతిలో ఉండే ఒక లావుపాటి దుడ్డు కర్ర చేతపట్టాడు.

''ఎవరక్కడ?'' అరుస్తూ అతడు లేచి నిలబ డ్డాడు.

ఉన్నట్లుండి చెట్లలో నిశ్శబ్దం అలుముకుంది.

''ఎవరక్కడ?'' అతడు మళ్లీ అరిచాడు.

జవాబేమీ లేదు.

''నేను కలగన్నానేమో'' అంటూ తనలో తాను

> నాకు దొంగలు, బందిపోటు, అడవి జంతువులన్నా ఏమీ భయంలేదు. డెహ్రా జిల్లా అంతటికి ఒకప్పుడు నన్ను మించిన వస్తాదు లేడన్న విషయం మీకిప్పుడే తెలుస్తుంది. ధైర్యముంటే దిగివచ్చి నాతో తలపడండి

గొణుక్కుంటూ పడుకుని మళ్లీ నిద్రపోదామను కుంటున్నాడు. ఇదంతా చూస్తూ ఉన్న తేజు ఒక్కసారి పగలబడి నవ్వాడు.

''హా!'' అంటూ అరుస్తూ అతడు మళ్లీ లేచి నిలబడ్డాడు.

''దొంగలా! మీ పని పడతానుండండి!'' అతడు తోట మధ్యకు అంగలు వేస్తూ తన బలాన్ని గురించి గొప్పలు చెప్పుకుంటున్నాడు.

''నాకు దొంగలు, బందిపోటు, అడవి జంతువులన్నా ఏమీ భయంలేదు. డెహ్రా జిల్లా అంతటికి ఒకప్పుడు నన్ను మించిన వస్తాదు లేడన్న విషయం మీకిప్పుడే తెలుస్తుంది. ధైర్య ముంటే దిగివచ్చి నాతో తలపడండి.''

''పరిగెత్తు!'' చెట్టులోంచి కిందకి దూకుతూ కోకి హెచ్చరించింది.

''పరిగెత్తు!'' అరిచాడు రంజీ, అది క్రికెట్ పోటీ అయినట్లు.

ఒక్కసారిగా బయలుదేరిన ఈ కలకలానికి తేజు కంగారు పడి చెట్టునుంచి జారిపడి ఏడవటం మొదలుపెట్టాడు.

రంజీ, కోకి అతడికి సహాయంగా వెళ్లక తప్పింది కాదు.

ఒక పెద్ద వస్తాదు లాంటి వ్యక్తి తమ వైపుకి రావడం చూడగానే తేజు టక్కున ఏడ్వటం ఆపేసి నిలబడ్డాడు. వెంటనే ముగ్గురు పరిగెత్తటం మొదలుపెట్టారు. వాళ్లకి కొంత దూరంగా కాపలావ్యక్తి దుడ్డుకర్ర ఊపుతూ, అరుస్తూ వెంట బడుతున్నాడు. మాజీ వస్తాదు అయినప్పటికీ (లేదా ఆ కారణంగానేనో) అతడు వేగంగా పరిగెత్తలేక రొప్పుకుంటూ, రోజుకుంటూ వస్తు న్నాడు. అతడు ఇరవై గజాలు దూరంగా ఉండగానే వాళ్లు గోడలు దూకేశారు. అతడికి గోడలు ఎక్కటం కూడా రాదు.

ముగ్గురూ మూడు వైపులకి పరిగెత్తి కొంత సేపటికి ఇంటికి తిరిగివచ్చారు,

* * *

మరుసటి రోజు కోకి, తేజులను రంజీ రోడ్డు చివర కలుసుకున్నాడు.

''అతడు ఉన్నాడా?'' అడిగింది కోకి.

''అతడిని చూడలేదు. కానీ, ఎక్కడో ఉండే ఉంటాడు.''

''బహుశా అన్నం తినటానికి వెళ్లాడేమో. పక్కగా నడుచుకుంటూ వెళుతూ ఒకసారి చూసొద్దాం.''

ఆ ముగ్గురు రోడ్డు మీద పచార్లు చేస్తున్నట్టు నడుచుకుంటూ వెళ్లారు. తోటలు ఎంతో బాగున్నాయి అంది కోకి. ఇంటి పై కప్పు మీదనుంచి గాలిపటం ఎగరవేస్తూ ఉన్న ఒక అబ్బాయిని ఆరాధనతో చూస్తున్నాడు తేజు. రంజీ ఒక కన్ను రోడ్డుమీద, ఒక కన్ను తోటగోడ మీద వేసి ఉంచాడు.

ముగ్గురు గోడకి దగ్గరగా వెళ్లారు. రంజీ అలాగే గోడకి ఆనుకుని నిలబడ్డాడు. రోడ్డు వెంట పూసిన పూలను కోకి కోయసాగింది. తన కుతూహలాన్ని ఆపుకోలేక తేజు గోడమీదకి ఎక్కి పరికించసాగాడు. గోడకి ఆవలివైపు వీళ్ల కోసమే నక్కి వున్న కాపలావ్యక్తి గోపాల్ అదే సమయంలో మెల్లగా లేచి నిలబడి తేజు వంక కోపంగా చూడసాగాడు.

తేజు గుటకలు మింగాడు కానీ అక్కడినుంచి కదలలేదు. కోపంతో ఎర్రబడిన కాపలావ్యక్తి కళ్లలోకి అతడు సూటిగా చూడసాగాడు.

''ఏం కావాలినీకు?'' గోపాల్ గర్జించాడు.

''ఊరికే చూస్తున్నాను'' అన్నాడు తేజు.

''ఏం చూస్తున్నావు?''

''తోట చూడటానికి బాగుంది''

గోపాల్ అయోమయంలో పడ్డాడు. నిన్న తాను వెంటపడిన పిల్లలు లాగానే ఉన్నారు కానీ అతడు ఖచ్చితంగా చెప్పలేకపోతున్నాడు. పైగా ఈ పిల్లల్లో తప్పు చేశామన్న భావన ఏ కోశానా కనపడటం లేదు. అయినా పిల్లల్లో ఎప్పుడైనా అపరాధ భావన కనపడుతుందా?'

''రోడ్డుకి అవతలి వైపునుంచి చూస్తే ఇంత కంటే మంచి దృశ్యం కనపడుతుంది'' అతడు కోపంగా అరిచాడు. ''పొండి ఇక్కడినుంచి!''

## దియా లవ్‌స్టోరీ

వివేక్ ఒబెరాయ్‌తో దియా మీర్జా చెట్టాపట్టాలేసుకు తిరుగుతోందని బాలీవుడ్ టాక్ ఈమధ్య మహబలేశ్వర్‌లో ధమ్ షూటింగ్ జరుగుతున్నపుడు చాలా దగ్గరయ్యారని వినికిడి. దియా ఎంత ప్రయత్నిస్తున్నా బాలీవుడ్‌లో హిట్ కొట్టలేకపోతోంది. ఒక్క సినిమాలోకూడా ఆమెను ప్రేక్షకులు గుర్తుపెట్టుకోవడం లేదు. ఈ రకమైన ఎఫైర్‌లలోనైనా పబ్లిసిటీ వస్తుందేమో చూడాలి!



''జామపండ్లు ఎంత బాగున్నాయి తియ్యగా'' నవ్వుతూ అంది కోకి. ఆ నవ్వుకి పడిపోని వాళ్లు చాలా అరుదు.

''అవును'' అన్నాడు రంజీ, తానేదో జామ పండ్ల నిపుణుడైనట్లు. '' అవి సరైన సైజులో, సరైన రంగులో ఉన్నాయి. ఇంతకంటే మంచి పండ్లు నేను చూసిన గుర్తులేదు. కానీ వాటిని తొందరగా కొయ్యకపోతే పక్షులు పాడు చేసేస్తాయి.''

అది నీకు సంబంధించిన విషయంకాదు'' అన్నాడు కాపలా వ్యక్తి.

''అతని కండలు చూడు'' అన్నాడు తేజు, మరో మార్గం వెతుకుతూ.

''అతడు నిజంగా బలశాలి!''

గోపాల్ ముఖంలో సంతోషం కనపడింది. ఇప్పుడు నడుము దగ్గర వదులుగా కొవ్వు పేరుకున్నప్పటికీ అతడు తన గత శక్తిని తలుచుకుని గర్వపడతాడు.

''నువ్వు వస్తాదులాగే ఉన్నావు'' అన్నాడు రంజీ.

''నేను వస్తాదునే'' అన్నాడు గోపాల్.

''నేను ముందే చెప్పలేదా! ''అతను వస్తాడు కాక ఏమిటనుకున్నావు?'' అంది కోకి.

''నేను ఒకప్పుడు వస్తాదుని'' అన్నాడు గోపాల్.

''నువ్వు అలా కనిపించటం లేదు'' అన్నాడు తేజు. పొగడ్తల ద్వారా ఏమైనా సాధించవచ్చని అతను చాలా తొందరగా గ్రహించాడు.

గోపాల్ గర్వంతో ఉప్పొంగిపోయాడు. ఇంతటి అభిమానం చవి చూసి చాలాకాలం అయ్యింది. ఉబ్బిపోతున్న బావురుకప్పలా అతడు కోకికి అనిపించాడు. అయినా ఆమె ఆ మాటలు బయటకి అనలేదు.

''నా కండలు చూడాలని మీకు ఉందా?'' అతడు అడిగాడు.

''నీ కండలు చూపించు'' అంటూ వాళ్లు అరిచారు.

గోపాల్ చొక్కా తీసేసి ఛాతి కొట్టుకున్నాడు. అది ఢంకాలాగా మోగింది. పిల్లలు నిజంగానే అబ్బురపడ్డారు. తరువాత మోచెయ్యి వంచి కండలు పొంగించాడు. అవి క్రికెట్ బంతుల్లా ఉన్నాయి.

''మీరు తాకి చూడవచ్చు'' అతడు ఉదారంగా అన్నాడు.

తేజు గోపాల్ చేతి దండలను వేలితో పొడిచాడు.

''మిస్టర్ యూనివర్స్!'' అంటూ తేజు అరిచాడు.

గోపాల్ ముఖం వెలిగిపోయింది. ఈ పిల్లలు అతడికి నచ్చారు. ఎంత తెలివైన వాళ్లు! తన బలం, తన శరీర దారుఢ్యం మెచ్చుకునే సుగుణం అందరిలో ఉండదు.

''గోడ దూకి నా దగ్గరకు రండి'' అతడు అన్నాడు. ''వచ్చి గడ్డిమీద కూర్చోండి నేను కుస్తీ వస్తాదుగా ఉన్నప్పటి సంగతులు చెబుతాను.

వాళ్లు గోడదూకి వచ్చి బుద్ధిమంతుల్లాగా గడ్డిమీద కూర్చున్నారు. అప్పుడు గోపాల్ తన విజయగాథలన్నీ చెప్పసాగాడు. ఒక ప్రపంచ ప్రఖ్యాత వస్తాదుని అయిదు సెకండ్లలో మట్టి కరిపించిన వైనం. ఒంటి చేత్తో నదిలోనుంచి కారుని బయటికి లాగి కారులో ఉన్న యాత్రికులను కాపాడిన విధానం. వాళ్లు ఓపిగ్గా వింటున్నారు. అప్పుడు తేజు తనకి ఆకలేస్తోందని చెప్పాడు.

''ఆకలిగా ఉందా?'' అన్నాడు గోపాల్, ''నాకు ముందే ఎందుకు చెప్పలేదు? నేను మీకు జామపండ్లు తెచ్చి ఇస్తాను. ఇక్కడ తినటానికి అంతకు మించి ఏమీ లేవు. ఏ చెట్టు కాయలు అన్నిటికంటే బాగుంటాయో నాకు తెలుసు. ఎవరూ తినకపోతే అవి రాలిపోయి పాడైపోతాయి. యజమాని చాలా ఎక్కువ ధర చెప్పటంతో ఈ సంవత్సరం ఎవరూ పంట కొనటం లేదు.''

గోపాల్ హడావిడిగా మాయమైపోయి అంతలోనే ఓ బుట్టనిండా జామపళ్లతో తిరిగివచ్చాడు.

''ఎవరికి కావలసినవి వాళ్లు తీసుకోండి'' అన్నాడు గోపాల్. ''కానీ మరీ ఎక్కువ తినవద్దు, జబ్బు చేస్తుంది.''

గోపాల్ తనను ముగ్గురు బందిపోటు దొంగలు అడ్డగించినపుడు వాళ్లని తానొక్కడు ఊరి చెరువులో ముంచిన ఘటన గురించి చెబుతుంటే వాళ్లు జామపండ్లు తింటూ వినసాగారు.

జామ పండ్లు అయిపోయి పిల్లలు వెళ్లిపోటానికి లేచినిలబడగానే ''రేపు మళ్లీ వస్తారా?'' గోపాల్ ఆత్రుతతో అడిగాడు. ''రేపు వస్తే మీకు మరో కథ చెబుతాను.''

పండ్లతో నిండుగా ఉన్న జామచెట్లను చూస్తూ తేజు ''మేము రేపు వస్తాం'' అన్నాడు.

వాళ్లు రేపు మళ్లీ రావాలని గోపాల్ కోరుకోసాగాడు. తోటలో అతడిని ఒంటరితనం వేటాడుతోంది. కోకి ఇది అర్థం చేసుకోగలిగింది. ''నీ కథలు మాకు నచ్చాయి'' ఆమె అంది.

''అవి మంచి కథలు'' అన్నాడు రంజీ, అవి కల్పితమని మనసులో అనుకున్నప్పటికీ...

వాళ్లు గోడనెక్కి, గోపాల్‌కి చేతులూపి వెళ్లిపోయారు.

వాళ్లు ఆ మరుసటి రోజు వచ్చారు.

జామపండ్ల కాలం అయిపోయి, తన కథలు తప్ప వాళ్లకి ఇవ్వటానికి గోపాల్ దగ్గర ఏమీ లేనప్పుడు కూడా అతన్ని చూడటానికి వాళ్లు వెళ్లేవారు. ఆపాటికి అతడంటే వాళ్లకి ఇష్టం కలిగింది.

**– అనువాదం. కె.సురేష్**